సాక్షి
మహబూబ్‌నగర్
బుధవారం, 1, జనవరి, 2025

లక్ష్య ఛేదనలో..



సాక్షి డిబేట్‌లో పాల్గొన్న ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు

- కొత్త అంశాలపై దృష్టిపెడతాం
- 'సాక్షి' డిబేట్‌లో విద్యార్థుల మనోగతం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు 2025 సంవత్సరంలో మార్పులు చేసుకుంటామని, రోజువారి జీవన విధానం, అలవాట్లలో కూడా మార్పులు తీసుకు వచ్చేందుకు కృషి చేయనున్నట్లు ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. ఈ మేరకు 'సాక్షి' ఆధ్వర్యంలో 'కొత్త సంవత్సరం.. కొత్త లక్ష్యాలు' పేరుతో మంగళవారం నిర్వహించిన డిబేట్‌లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కొత్త సంవత్సరంలో తీసుకోవాల్సిన నిర్ణయాలు, చేపట్టాల్సిన మార్పులపై విస్తృతమైన చర్చ జరిపారు. గత 2024 సంవత్సర స్మృతులు నెమరేసుకుంటూ.. కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు.

చదువులో రాణించేందుకు..



గత సంవత్సరంలో కూడా ఎక్కువ మార్కులు సాధించేందుకు ఎంతో కృషి చేశా. ప్రస్తుత 2025 సంవత్సరంలో చదువులో మరింత మెరుగ్గా రాణించేందుకు ప్రత్యేక నిర్ణయాలు తీసుకుంటా. అందుకనుగుణంగా టైం టేబుల్‌తో పాటు వినూత్న పద్ధతిలో చదివేందుకు ఈ సంవత్సరం మార్పులు చేసుకుంటా. భవిష్యత్‌లో మంచి ర్యాంకులు సాధించి జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు కృషి చేస్తా. – శ్రీనిజ

ఐపీఎస్ లక్ష్యం..



చదువులో అన్ని సబ్జెక్టుల్లో బాగానే రాణిస్తున్నా. వచ్చే సంవత్సరంలో చదువులో వస్తున్న ఇబ్బందులను అధిగమించేందుకు, సందేహాల నివృత్తికి తీసుకోవాల్సిన మార్పులపై కృషి చేస్తా. ఐపీఎస్ కావాలన్న లక్ష్యం కోసం చాలా శ్రమిస్తా. అందుకోసం సమయం వృథా చేయకుండా చదువులపై దృష్టిపెట్టేలా మార్పులు చేసుకుంటూ 2025 సంవత్సరంలో మరింత ఉత్సాహంగా ఉండేందుకు నిర్ణయాలు తీసుకుంటాను. – రూపిక

ఆలోచనల్లో మార్పులు..



చదువులో ముందు రాణిస్తామనే మంచి ధోరణితోనే లక్ష్యం వైపు అడుగులు వేస్తా. 2025 సంవత్సరంలో కూడా తక్కువ మార్కులు వస్తాయన్న ఆలోచన లేకుండా పూర్తిస్థాయిలో మన తోటి వారికి కూడా పోటీగా చదవాలన్న ఆలోచనతో ముందుకు వెళ్తా. మార్కులు సాధించేందుకు కావాల్సిన కొత్త విషయాలను అధ్యాపకుల ద్వారా తెలుసుకుంటే సులభంగా వచ్చే సంవత్సరం లక్ష్యాన్ని చేరుకోవచ్చు. – సాయిసుధ

టీవీ, ఫోన్‌కు దూరంగా..



చదువులో వెనుకబడకుండా ఉండాలంటే తప్పకుండా టీవీ, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండటం మంచిదని తెలిసింది. ఈ పరీక్షలు పూర్తయ్యే వరకు వాటికి దూరంగా ఉండేందుకు ఈ సంవత్సరం నుంచి నిర్ణయం తీసుకోవాలని అనుకుంటున్నా. చాలా సమయం పుస్తకాలతో గడపడం వల్ల పరీక్షల్లో రాణిస్తానని, మంచి మార్కులు సాధిస్తానన్న నమ్మకం ఉంది. – వైశాలి

చాలెంజ్‌గా తీసుకుని..



2025 సంవత్సరం నా జీవితంలో ఎంతో కీలకమైంది. అందుకోసం పూర్తిగా నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునేలా మార్పులు చేసుకుంటా. ఎక్కువ సమయం చదువుపై దృష్టిపెట్టి.. సమయం వృథా కాకుండా జాగ్రత్త పడతాను. ప్రతి సంవత్సరం ప్రతిఒక్కరి జీవితంలో కీలకమైందే. కానీ, ప్రతి సంవత్సరాన్ని చాలెంజ్‌గా తీసుకుని లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేయాలి. – తమీమా ఫాతిమా

కొత్త అంశాలు నేర్చుకునేందుకు..



నాకు అలవాటులో భాగంగా కొత్త విషయాలు నేర్చుకోవాలని అభిరుచి. అందులో భాగంగా వచ్చే సంవత్సరం తప్పకుండా కొత్త పుస్తకాల తెచ్చుకోవడం, వాటిలో అంశాలు తెలుసుకోవడం, టెక్నాలజీ పరంగా కొత్త విషయాలు నేర్చుకునే విధంగా నా నిర్ణయాలు ఉంటాయి. నేను తెలుసుకునే అంశాలు నా చదువుపరంగా కూడా ఉపయోగపడేలా జాగ్రత్త పడతాను. – శ్రావణి

చదువుపైనే దృష్టి..



ఈ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు పూర్తయ్యే వరకు కూడా స్నేహితులకు దూరంగా ఉండి చదువుల మీద దృష్టి పెట్టాలనకుంటున్నా. దీని వల్ల సమయం వృథా కాకుండా ఎక్కువ సేపు చదువులపై దృష్టి సారించేందుకు అవకాశం ఉంటుంది. గత సంవత్సరంలో తెలియకుండా జరిగిన చిన్నపాటి పొరపాట్లను సరిదిద్దుకుంటూ.. ప్రస్తుత సంవత్సరానికి స్వాగతం పలకాలి అనుకుంటున్నాను. – యాస్మిన్‌షేక్

స్కిల్స్ డెవలప్ చేసుకుంటా..



వచ్చే సంవత్సరం పలు విషయాలకు సంబంధించి స్కిల్స్ డెవలప్ చేసుకోవాలని ఉంది. వీటితో భవిష్యత్‌లో ఉద్యోగావకాశాల కోసం వెళ్లిన ఇతర అవసరాల దృష్ట్యా తప్పకుండా స్కిల్స్ ముఖ్యంగా టెక్నాలజీ పరంగా అంశాలను నేర్చుకోవాలి అనుకుంటున్నా. చదువులకు ఇవి అదనపు అర్హతలుగా ఉంటే భవిష్యత్ బాగుంటుందని నా అభిప్రాయం. – హిమవర్షిణి

పోలీస్ అవుతా..



నాకు ఊహ తెలిసినప్పటి నుంచి పోలీస్ కావాలనే కల ఉంది. ఇంటర్మీడియట్ పూర్తికావాల్సి వస్తున్న నేపథ్యంలో వచ్చే సంవత్సరం నుంచి పోలీస్ అయ్యేందుకు ఏం చేయాలనే విషయంపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకునేందుకు సమయం కేటాయిస్తాను. అందుకోసం రన్నింగ్ వంటివి అలవాటు చేసుకుంటాను. – భార్గవి

దుకాణాల అద్దె చెల్లించకుంటే జప్తు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దుకాణాలను మూసేసి అద్దె చెల్లించకుండా ఉంటే జప్తు చేస్తామని మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం న్యూటౌన్‌లోని ఐడీఎస్‌ఎంటీ కాంప్లెక్స్‌ను తనిఖీ చేశారు. ఇక్కడ కొన్ని నెలలుగా మూసేసిన (సెల్ఫ్ లాక్) కే6000 దుస్తుల దుకాణదారు నుంచి సుమారు రూ.45 లక్షలు, నజీబ్ హార్డ్‌వేర్ షాపు నుంచి సుమారు రూ.12 లక్షలు మున్సిపాలిటీకి రావాల్సి ఉందని ఆర్‌ఓ మహమ్మద్ ఖాజా వివరించారు. దీంతో ఈ రెండు దుకాణాలలో ఉన్న వస్తువులను జప్తు చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సదరు యజమానుల నుంచి ఈ బకాయిలను వసూలు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇదే కాంప్లెక్స్‌లో రెండు టీ కొట్లు, ఓ హోటల్–టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసుకున్న నిర్వాహకులను ఖాళీ చేయాలన్నారు.



న్యూ ఇయర్ వేడుకల్లో కేరింతలు కొడుతున్న యువతులు

నయా జోష్

ఉత్సాహంగా కొత్త సంవత్సరం వేడుకలు

- సంబరంగా స్వాగతించిన యువత
- కిటకిటలాడిన మద్యం దుకాణాలు, బేకరీలు

ఆశ, నిరాశల మధ్య ఊగిసలాటలో ఓ ఏడాది కరిగిపోయింది. వేల ఆశలు, ఆకాంక్షలు ఎన్నెన్నో అవకాశాలతో మరో ఏడాది మన ముంగిట్లోకి వచ్చింది. నయా సాల్ జోష్‌తో పాలమూరు హోరెత్తింది. ఆటాపాటలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికింది. 2024కి బై బై.. 2025కి వెల్‌కమ్ అనే హడావుడే నెలకొంది. అర్ధరాత్రి 12 గంటల దాటగానే హ్యాపీ న్యూ ఇయర్ అంటూ చిన్నా, పెద్ద తేడా లేకుండా కేరింతలు కొట్టారు. కేక్‌లు కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఎటుచూసినా కొత్త సంవత్సర వేడుకల సంబరమే కనిపించింది. హాస్టళ్లలో యువత ఉత్సాహం ఉరకలేసింది. మద్యం షాపులు, బేకరీల్లో రాత్రి పొద్దుపోయే వరకు అమ్మకాలు కొనసాగాయి. అర్ధరాత్రి ఎస్పీ జానకి ప్రత్యక్షంగా డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు, గొడవలు, ర్యాష్ డ్రైవింగ్‌ను నివారించేందుకు డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా పది బృందాలతో పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. – పాలమూరు



2025 ఆకృతిలో కోయిలకొండ విద్యార్థులు



జిల్లాకేంద్రంలోని మధురానగర్‌లో న్యూ ఇయర్ సంబరాలు



బేకరీలో కిటకిట



జిల్లాకేంద్రంలో నృత్యం చేస్తున్న యువతులు





అర్ధరాత్రి పాలమూరులో డ్రంకెన్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

4న సోషల్ టాలెంట్ పరీక్ష

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సాంఘిక శాస్త్ర ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆ ఫోరం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌గౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జెడ్పీహెచ్‌ఎస్, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, గురుకుల పాఠశాలల నుంచి తెలుగు, ఇంగ్లిష్ మీడియం వారీగా ఇద్దరి చొప్పున పరీక్షకు హాజరుకావచ్చని పేర్కొన్నారు. శనివారం ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని, ఇతర వివరాల కోసం 9441302084, 9948731533 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలి



చిన్నచింతకుంట మండలం అప్పంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

- కలెక్టర్ విజయేందిర బోయి

దేవరకద్ర/ చిన్నచింతకుంట: ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పక పాటించాలని అధికారులను కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. మంగళవారం కౌకుంట్ల మండలంలోని అప్పంపల్లి, దేవరకద్ర మండలంలోని హాజిలాపూర్‌లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేను వేగవంతం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా సర్వే చేస్తున్న విధానాన్ని, ఇందిరమ్మ యాప్‌లో లబ్ధిదారుల వివరాలను ఏవిధంగా నమోదు చేస్తున్నారో పరిశీలించారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారుడి ఇంటికి సర్వే బృందం తప్పనిసరిగా వెళ్లి అక్కడి పరిస్థితిని గమనించి వివరాలు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ అనిల్, ఆర్‌ఐ శరత్, పంచాయతీ కార్యదర్శి మమత, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

త్యాగాలు చేసిన వారిని అభినందించాలి

మహబూబ్‌నగర్ క్రైం: పోలీస్ శాఖలో ఎన్నో త్యాగాలు చేసి సేవలు అందించిన వారిని అభినందించాలని జిల్లా ఎస్పీ డి.జానకి అన్నారు. పదవీవిరమణ పొందిన డీసీఆర్‌బీ సీఐ రాములు, హెడ్‌కానిస్టేబుల్ చెన్నారెడ్డిలను ఎస్పీ కార్యాలయంలో సన్మానించారు. పోలీస్ విభాగంలో సుదీర్ఘంగా పని చేయడంతో పాటు క్లిష్టసమయాల్లో విధులు నిర్వహించి శాంతియుతమైన వాతావరణం కల్పించడంలో ఎంతో కృషి చేశారని తెలిపారు. భవిష్యత్‌లో ఆరోగ్యంతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు, ఏఆర్ ఏఎస్పీ సురేష్‌కుమార్, డీఎస్పీలు రమణారెడ్డి, సుదర్శన్, సీఐ అప్పయ్య, ఆర్‌ఐలు కృష్ణయ్య, నగేష్ పాల్గొన్నారు.

ఒక్కరోజే రూ.12.60కోట్ల మద్యం అమ్మకాలు

తిమ్మాజిపేట: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు మద్యం సరఫరా చేసే ఏకైక మద్యం డిపో ద్వారా మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. కొత్తసంవత్సర వేడుకల సందర్భంగా రూ.12.60కోట్ల విలువ గల మద్యం తాగేసి రికార్డు సృష్టించారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల కేంద్రంలోని మద్యం డిపో ద్వారా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 120 మద్యం దుకాలకు మద్యం సరాఫరా చేస్తున్నారు. డిసెంబర్ 31న 11,400లిక్కర్ కేసుల అమ్మకాలు, 18,401 కేసుల బీర్ అమ్మకాలు జరిగినట్లు డిపో మేనేజర్ సయ్యద్ అబ్దుల్ వాసే తెలిపారు. ఏప్రిల్ నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు తొమ్మిది నెలలో లిక్కర్ 14లక్షల 19వేల కేస్‌లు, బీర్ 21లక్షల 18వేలు కేస్‌ల నిలువ 1300 కోట్ల అమ్మకాలు జరిగినట్లు డిపో అధికారులు ఏడాది పూర్తయ్యేందుకు మరో మూడు నెలల ముందుగానే రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు జరిగాయి.

రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై కుట్రలు జరుగుతున్నాయని, 42శాతం రిజర్వేషన్ పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌సాగర్ అన్నారు. మంగళవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణన సర్వేపై ఒక శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, సర్వేపై అధికారులు తప్పుడు లెక్కలు చూపిస్తూ ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించే విధంగా ముందుకు వెళుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి కులగణనపై చిత్తశుద్ధి ఉంటే పూర్తిస్థాయిలో సమగ్ర కులగణన నిర్వహించిన తర్వాతనే ఎన్నికలు చేపట్టాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సమగ్ర కుటుంబ సర్వే చేపట్టినప్పటికీ అది పూర్తిస్థాయిలో జరగడం లేదని, పట్టణ ప్రాంతాల్లో, హైదరాబాద్ నగరంలో చాలా ఇళ్లకు సర్వే అధికారులు వెళ్లలేదని, అలాంటప్పుడూ ఏ విధంగా లెక్క తేలుస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా 42శాతం బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సారంగి లక్ష్మీకాంత్, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షులు బుగ్గన్న, బి.శేఖర్, కోమల్ కుమార్, ఆంజనేయులు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నెట్‌బాల్ పోటీలు ప్రారంభం

- 26 జిల్లాల పురుష, మహిళా జట్లు హాజరు
- మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జట్ల శుభారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మంగళవారం రాష్ట్రస్థాయి సీఎం కప్ నెట్‌బాల్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపంగా క్రీడా శాఖాధికారులు, క్రీడాకారులు, వివిధ క్రీడాసంఘాల ప్రతినిధులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్, పశుసంవర్ధశాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌గౌడ్, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్ష, కార్యదర్శులు విక్రం ఆదిత్యరెడ్డి, ఖాజాఖాన్, జిల్లా యోగా సంఘం కార్యదర్శి విలియం, జిల్లా కబడ్డీ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి బాల్‌రాజు, వృత్తినైపుణ్య శిక్షణ కేంద్రం ఇన్‌చార్జీ ఎస్.విజయ్‌కుమార్, డీఎస్ఏ సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, డీఎస్ఏ కోచ్‌లు, పీఈటీలు పాల్గొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ మెయిన్ స్టేడియాన్ని సందర్శించి పలువురు క్రీడాజట్లను పరిచయం చేసుకున్నారు.

శుభారంభం చేసిన ఉమ్మడి జిల్లా జట్లు

నెట్‌బాల్ టోర్నీలో 26జిల్లాల నుంచి పురుషుల, మహిళా జట్లు పాల్గొన్నాయి. నాలుగు కోర్టుల్లో లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. తొలిరోజు నెట్‌బాల్ పోటీల్లో మహిళల విభాగంలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జట్లు, పురుషుల విభాగంలో నారాయణపేట, నాగర్‌కర్నూల్ జట్లు శుభారంభం చేశాయి. మహబూబ్‌నగర్ జట్టు 19–12 పాయింట్ల తేడాతో జనగాం జట్టుపై, నాగర్‌కర్నూల్ జట్టు 11–6 తేడాతో నారాయణపేట జట్టుపై విజయాలు నమోదు చేసుకున్నాయి. మిగతా మహిళల మ్యాచుల్లో ఖమ్మం జట్టు 31–5 పాయింట్ల తేడాతో నిజామాబాద్ జట్టుపై, భద్రాద్రి కొత్తగూడెం జట్టు 10–1 తేడాతో ఆదిలాబాద్‌పై, వరంగల్ జట్టు 11–4 తేడాతో రాజన్న సిరిసిల్ల జట్టుపై, హన్మకొండ జట్టు 14–1 తేడాతో కరీంనగర్ జట్టుపై, జగిత్యాల జట్టు 16–5 తేడాతో మంచిర్యాల జట్టుపై, మేడ్చల్ జట్టు 31–7 తేడాతో హైదరాబాద్ జట్టుపై గెలుపొందాయి. పురుషుల విభాగంలో నారాయణపేట జట్టు 37–2 పాయింట్ల తేడాతో మంచిర్యాల జట్టుపై, నాగర్‌కర్నూల్ జట్టు 25–15 పాయింట్ల తేడాతో వరంగల్ జట్టుపై విజయం సాధించాయి. ఇతర మ్యాచుల్లో మహబూబాబాద్ జట్టు 24–6 తేడాతో వనపర్తి జట్టుపై, హైదరాబాద్ జట్టు 20–10 తేడాతో గద్వాల జట్టుపై, ఖమ్మం జట్టు 45–8 తేడాతో ఆదిలాబాద్ జట్టుపై, మేడ్చల్ జట్టు 10–27 తేడాతో కామారెడ్డి జట్టుపై, జనగాం జట్టు 16–5 తేడాతో ఆసిఫాబాద్ జట్టుపై, భద్రాద్రి కొత్తగూడెం జట్టు 10–1 తేడాతో రాజన్న సిరిసిల్ల జట్టుపై, హన్మకొండ జట్టు 8–5 తేడాతో జగిత్యాల జట్లపై గెలుపొందాయి. రాష్ట్రస్థాయి సీఎం కప్ నెట్‌బాల్ పోటీల్లో మహబూబ్‌నగర్ పురుషుల జట్టు జట్టు 20–6 పాయింట్ల తేడాతో జగిత్యాల జట్టుపై గెలుపొందింది.

పోలీసులకు ఉత్తమ సేవా పతకాలు


సురేష్‌కుమార్, ఏఆర్ ఏఎస్పీ


ఎండీ గయాసుద్దీన్, ఆర్ఎస్ఐ, ఏఆర్


లక్ష్మారెడ్డి, ఏఎస్ఐ, రాజాపూర్


అతికుర్ రహమాన్, ఏఎస్ఐ బాలానగర్


వనజారెడ్డి, ఏఎస్ఐ ఉమెన్ పీఎస్

మహబూబ్‌నగర్ క్రైం: రాష్ట్ర ప్రభుత్వం పోలీస్‌శాఖలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బందికి ఉత్తమ సేవా పతకాలతో పాటు సేవా పతకాలను ప్రకటించింది. ప్రస్తుతం పతకాలు పొందిన సిబ్బందికి జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అందజేయనున్నారు. వారిని ఎస్పీ జానకి అభినందించారు.

■ మహబూబ్‌నగర్ జిల్లాలో ఉత్తమ సేవా పతకం పొందిన వారిలో ఏఆర్ ఆర్ఎస్ఐ ఎండీ గయాసుద్దీన్, రాజాపూర్ ఏఎస్ఐ డి.లక్ష్మారెడ్డి, బాలానగర్ ఏఎస్ఐ అతీకుర్ ఉర్ రహ్మాన్, ఉమెన్ పీఎస్ ఏఎస్ఐ వనజారెడ్డి, ఇంటలిజెన్స్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్స్ జి.రాజవర్ధన్‌రెడ్డి, జి.తిరుపతయ్య ఉన్నారు. సేవా పతకం పొందిన వారిలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్‌కుమార్, ఏఆర్ ఎస్ఐ దామోదర్, స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ కె.విజయ్‌కుమార్, డీసీఆర్‌బీ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌గౌడ్, ఇంటలిజెన్స్ విభాగంలో హెడ్‌కానిస్టేబుల్స్ శ్రీశైలం, దుర్గయ్య ఉన్నారు.

■ నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉత్తమ సేవా పతకం పొందిన వారిలో తిమ్మాజిపేట ఏఎస్ఐ శ్రీనివాసులు ఉన్నారు. నారాయణపేట జిల్లాలో డీఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ చంద్రప్ప, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ శంకర్‌రెడ్డి ఉన్నారు.

■ వనపర్తి జిల్లాలో సేవా పతకం పొందినవారిలో చిన్నంబావి ఏఎస్ఐ రమేష్, మదనాపురం ఉమెన్ ఏఎస్ఐ శివపార్వతి, వనపర్తి రూరల్ పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రాములు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ అబ్రహం, పెద్దమందడి కానిస్టేబుల్ వెంకటేశ్వరాచారి, ఏఆర్ కానిస్టేబుల్ సురేందర్‌గౌడ్, గద్వాల జిల్లాలో మల్దకల్ హెడ్‌కానిస్టేబుల్ పురేందర్, ట్రాఫిక్ పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ నారాయణ, డీసీఆర్‌బీ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్‌రెడ్డి, డీఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ రవీందర్‌గౌడ్, శాంతినగర్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటస్వామిగౌడ్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ తులసయ్యనాయక్ ఉన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్స్ జి.ప్రభాకర్, రామచంద్రుడు, వి.సత్యనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, పర్వతాలు, నరేందర్‌గౌడ్, కుల్వకుర్తి హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డి, పీసీఆర్ కానిస్టేబుల్ శ్యామ్‌సుందర్, ఏఆర్ కానిస్టే బుల్స్ తిరుపతయ్య, ఆంజనేయులు, పి.రాములు ఉన్నారు. నారాయణపేట జిల్లాలో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్స్ క్రిష్ణయ్య,ఆర్.శ్రీనివాస్, నర్సయ్య ఉన్నారు.

3న యూజీసీ నెట్ పరీక్ష నిర్వహణ

- కలెక్టర్ విజయేందిర బోయి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జనవరి 3వ తేదీన యూజీసీ నెట్–2024 ఎగ్జామ్స్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించే ఈపరీక్షకు ఎం.వి.ఎస్, ఇన్ఫోటెక్ సర్వీసెస్, ఫాతియా విద్యాలయంను పరీక్ష కేంద్రంగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. నెట్ పరీక్షకు 185 మంది అభ్యర్థులు హాజరు అవుతారని అన్నారు. మొదటి షిఫ్ట్‌లో 91మంది, రెండో షిఫ్ట్‌లో 94 మంది పరీక్షలు రాస్తారన్నారు. పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించినట్లు ఆమె తెలిపారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్ల పరిశీలన



ఎస్వీకేఎం పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

జడ్చర్ల టౌన్: జనవరి 7, 8, 9 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను జడ్చర్లలోని నిర్వహించనున్నారు. మంగళవారం ఎస్వీకేఎం పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్లను ఎస్ఈఆర్‌టీ సంచాలకులు రమేష్, ఆర్‌జేడీ విజయలక్ష్మి, డీఈఓ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. అక్కడ విద్యార్థుల ప్రదర్శనలను ప్రదర్శించే స్థలాలు, భోజనవసతి, మరుగుదొడ్లు, రాత్రిబస అంశాలను ఆరాతీశారు. ఏర్పాట్లు బాగున్నాయని వారు సంతృప్తి వ్యక్తంచేశారు. వారివెంట ఎస్ఈఆర్‌టీ ప్రొఫెసర్ సురేష్ బాబు, సమగ్ర శిక్ష సీఎంఓ బాలుయాదవ్, జిల్లా సైన్స్‌అధికారి శ్రీనివాస్, జీహెచ్ఎం రవీందర్‌గౌడ్, పాఠశాల ప్రిన్సిపాల్ ఎబ్నీజర్ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు అన్నివర్గాల మద్దతు



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని.. వేల గొంతులు, లక్షల డప్పుల కార్యక్రమానికి ప్రతి ఇంటికొక డప్పుతో స్వచ్ఛందంగా తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేష్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, అనుబంధ సంఘాల ఉమ్మడి జిల్లా సమావేశం టైగర్ జంగయ్య అధ్యక్షతన జరగగా.. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు సమాజంలోని అన్ని వర్గాల మద్దతు ఉందని.. కొంత మాల కులంలోని స్వార్థపరులు అడ్డుకోవడానికి అనేక కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌పార్టీలో మాలలకు రాజకీయ పలుకుబడి ఎక్కువ ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలులోకి తీసుకురాకుండా అడ్డుతగులుతోందని తెలిపారు. ఈ అడ్డంకులను ఎదుర్కోవాల్సిన బాధ్యత మాదిగ, ఉప కులాల ప్రజలపై ఉందని.. మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఫిబ్రవరి 3న హైదరాబాద్‌లో నిర్వహించే వేల గొంతులు, లక్షల డప్పులు పేరుతో మహా ప్రదర్శన నిర్వహించనున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్యం చేయడానికి ఈ నెల 3న మహబూబ్‌నగర్‌లో కళాకారుల ఆధ్వర్యంలో రథయాత్ర ప్రారంభిస్తున్నామని చెప్పారు. అలాగే 13న ఉమ్మడి సన్నాహక మహాసభను నిర్వహిస్తున్నామని, ముఖ్యఅతిథిగా మందకృష్ణ మాదిగ పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ, రాష్ట్ర కార్యదర్శి యాదగిరి, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందె కార్తీక్, నాయకులు శ్రీరాములు, కళ్యాణ్, రాజేష్, చెన్నకేశవులు, ఖాసీం, నర్సింహులు, టైగర్ రాజు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా ఉల్లి ధర

- గరిష్టంగా రూ.3590
- కనిష్టంగా రూ.3150

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో మంగళవారం ఉదయం జరిగిన బహిరంగ వేలంలో ఉల్లి ధర నిలకడగా ఉంది. గరిష్టంగా రూ.3590, కనిష్టంగా రూ.3150గా నమోదైంది. బుధవారం కొత్త సంవత్సరం సందర్భంగా మార్కెట్‌కు సెలవు కావడంతో ఒక రోజు ముందుగానే ఉల్లిని వేలం వేశారు. గతవారం నమోదైన ధరలే ఈవారం నమోదయ్యాయి. దాదాపు 200బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది. వాటిని వేలంవేయగా స్థానికవ్యాపారులతో పాటు బయటి నుంచి వచ్చిన వ్యాపారులు పోటీపడి కొనుగోలుచేశారు. మార్కెట్ ని బంధనల ప్రకారం 45 కేజీలుగా తూకంవేసిన బస్తాలను గరిష్టంగా రూ.1800, కనిష్టంగా రూ. 1600గా విక్రయించారు.

మెడికల్ కళాశాలకు మృతదేహం అప్పగింత

పాలమూరు: జడ్చర్లలోని సత్యేశ్వర ఆశ్రమంలో మంగళవారం అనారోగ్యంతో మృతిచెందిన గొల్ల భీమమ్మ(78) మృతదేహాన్ని పాలమూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అప్పగించారు. వైద్య కళాశాల విద్యార్థులకు ల్యాబ్‌లో ఉపయోగంకోసం మృతదేహాన్ని కళాశాల అనాటమి విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పరిమళకు అప్పగించారు. ఈసందర్భంగా మృతదేహానికి ఎంబీబీఎస్ ఫస్టియర్ విద్యార్థులు ని వాళులర్పించారు. కార్యక్రమంలో ఆశ్రమనిర్వాహకుడు రామకృష్ణ, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

అడ్డాకుల: మండలంలోని ముత్యాలంపల్లి సమీపంలో రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు మహబూబ్‌నగర్ రైల్వే ఎస్ఐ సయ్యద్ అక్బర్ తెలిపారు. వివరాలు.. సుమారు 35నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి రైలుపట్టాలపై తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో తల భాగం తెగిపోయి ట్రాక్‌పై పడింది. మృతుడి వివరాలు, ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. రైలు పట్టాలపై మృతదేహం కనిపించడంతో స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని రైల్వే ఎస్ఐ కోరారు.

ఎస్సీల స్థితిగతులపై అధ్యయనం

- సమగ్ర వివరాలతో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం
- రాష్ట్ర ఎస్సీ కులాల ఏకసభ్య విచారణ కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఎస్సీల స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి నివేదిస్తామని రాష్ట్ర ఎస్సీ కులాల ఏకసభ్య విచారణ కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్ అన్నారు. మంగళవారం కమిషన్ చైర్మన్ మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై అధ్యయనం నిమిత్తం ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ కులాలు, సంఘాలు, నాయకులతో బహిరంగ విచారణ నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీల అభ్యున్నతి కోసం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలని స్వయంగా వినతులను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. బహిరంగ విచారణలో స్వీకరించిన దరఖాస్తులు, అభిప్రాయాలు, ఉద్యోగ, విద్య, రాజకీయ, ఆర్థిక రంగంలో ఎస్సీ కులాలు ఏ విధంగా లబ్ధి పొందుతున్న అంశాలు, స్థితిగతులపై క్షుణ్ణంగా పరిశీలన, అధ్యయనం చేసి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. దరఖాస్తు సమర్పించే వారందరూ వ్యక్తిగతంగా గాని, సంఘాలు గాని ఎలాంటి ఆటంకం లేకుండా స్వేచ్ఛగా తమ వినతులు సమర్పించాలని కోరారు. కోర్టు జడ్జిమెంట్ పరిగణలోకి తీసుకొని వీటన్నింటిపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేస్తామన్నారు. ఇది వరకు హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, నల్లగొండ, వరంగల్, కరీంనగర్ తదితర జిల్లాల్లో బహిరంగ విచారణ పూర్తయ్యిందని, జిల్లాల సందర్శన సందర్భంగా దరఖాస్తు సమర్పించలేకపోయిన వారు హైదరాబాద్‌లో నేరుగా కమిషన్‌కు అభిప్రాయాలు తెలియజేయవచ్చన్నారు.

● జనాభా ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేస్తే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని జిల్లా మాదిగ జేఏసీ నాయకులు మెట్టు యాదన్న తెలిపారు. మాదిగ జనాభా 90 శాతం ఉందని, రాష్ట్ర జనాభా ప్రకారం వర్గీకరణ చేస్తే జిల్లాకు అన్యాయం జరుగుతుంది. కమిషన్‌ను కలిసిన వారిలో గోపాల్, దేవన్న, సురేష్, శాంతయ్య, మల్లేష్, రాజారాం తదితరులున్నారు.

రాజ్యాంగ విరుద్ధం..

ఆర్టికల్ 341 ప్రకారం వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని జాతీయ మాల మహానాడు స్టేట్ కోఆర్డినేటర్ వెంకటస్వామి అన్నారు. పెరిగిన దళితుల జనాభా దామాషా ప్రకారం 25 శాతానికి రిజర్వేషన్ పెంచాలి. 2011 కులగణన సరికాదని 2024 కులగణన చేయాలి. ఏదేమైనా దళితుల ఐక్యత కోసమే కమిషన్ రిపోర్టు తయారు చేయాలి. కమిషన్‌ను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు చిన్న, నాయకులు ఆనంద్, రవికుమార్, శ్రీనివాస్, తిరుపతయ్య, రాజు, కిరణ్, కృష్ణ తదితరులున్నారు.

160 దరఖాస్తుల స్వీకరణ

కాగా షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణపై నిర్వహించిన బహిరంగ విచారణలో 160 మంది వ్యక్తిగతంగా, కుల సంఘాల పరంగా దరఖాస్తులు అందించారు. అంతకు ముందు మహబూబ్‌నగర్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్ విజయేందిర కమిషన్ చైర్మన్‌కు స్వాగతం పలికారు. కమిషన్ విచారణ అనంతరం మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని 11 వార్డు పాత పాలమూరు ఎస్సీ వాడలో పర్యటించారు. వీధుల్లో తిరుగుతూ.. స్థానికులతో మాట్లాడి.. వారి స్థితిగతులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సుదర్శన్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ అదనపు డైరెక్టర్ శ్రీధర్, రాష్ట్ర కార్యాలయ సూపరింటెండెంట్ సజ్జన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.